314) దేసాళం/ఖరహరప్రియ

ప|| ధరణి నెంద రెన్నితపములు చేసినాను | హరికృపగలవాడే అన్నిటా బూజ్యుడు ||

చ|| మితిలేనివిత్తు లెన్ని మేదినిపై జల్లినాను | తతితో విత్తినవే తగ బండును |
యితరకాంతలు మఱి యెందరు గలిగినాను | పతి మన్నించినదే పట్టపుదేవులు ||

చ|| పొలుపడి నరులెన్ని పాట్ల బడికొలిచినా- | నేలికె చేపట్టినవాడే యెక్కుడుబంటు |
మూల నెంతధనమున్నా ముంచి దానధర్మములు | తాలిమితో నిచ్చినదే దాపురమై నిల్చును ||

చ|| యెన్నికెకు గొడుకులు యెందరు గలిగినాను | యిన్నిటా ధర్మపరుడే యీడేరును |
వున్నతి జదువులెన్ని వుండినా శ్రీవేంకటేశు | సన్నుతించినమంత్రమే సతమై ఫలించును ||